APTEL/26/A0542

# స్ఫూర్తి పత్రిక

*Voice of Truth*

ప్రచురణ : కర్నూలు | సంపాదకుడు : నరసనాయుడు బోయ | సంపుటి : 01 సంచిక :78 | పేజీలు : 04 వెల రూ. 2/- | శుక్రవారం 15-05-2026

PUBLICATION : KURNOOL | EDITOR : NARASANAIDU BOYA | VOLUME : 01 ISSUE : 78 | PAGES : 04 PRICE : 2 | FRIDAY, 15 MAY 2026

Kurnool Edition | Covering Andhra Pradesh & Telangana |

విలేకరులు కావలెను

స్ఫూర్తి పత్రిక డైలీ పేపర్ నందు

కర్నూలు,నంద్యాల,అనంతపురం, శ్రీ సత్యసాయి, వైయస్సార్ ,తిరుపతి, అన్నమయ్య ,చిత్తూరు ,జిల్లాలలో పనిచేసేందుకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ నియోజకవర్గ ఇన్చార్జీలు మండల రిపోర్టర్స్ కావలెను.

స్ఫూర్తి పత్రిక Voice of Truth

గతంలో పత్రికా రంగంలో పనిచేసిన అనుభవం వార్తలు చక్కగా రాయగలిగే నైపుణ్యం గల వారికి అవకాశం కలదు.

ఎటువంటి యాడ్స్ టార్గెట్లు లేదు. కొత్త వారికి అవకాశం కలదు.

ఆసక్తి గలవారు సంప్రదించండి : 8179446036,7794947413.

## ప్రపంచ స్థాయి బ్రాండ్లు ఏపీ నుంచే తయారవుతున్నాయి

### ఇప్పుడు ఆ బ్రాండ్లన్నీ ఏపీ నుంచే

- 'మేడ్ ఇన్ ఏపీ'పై మంత్రి నారా లోకేష్ ఆసక్తికర ట్వీట్
- రాష్ట్రంలో తయారీ రంగంపై ఓ ప్రత్యేక వీడియో విడుదల
- ప్రపంచ స్థాయి మౌలిక వసతులే ఇందుకు కారణమన్న లోకేష్




అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో తయారీ రంగం దూసుకెళుతోందని, 'మేడ్ ఇన్ ఆంధ్రప్రదేశ్' అనేది ఇప్పుడు నాణ్యతకు, నమ్మకానికి చిహ్నంగా మారుతోందని మిగతా.. 2లో

## కుమారుడి నేరం రుజువైతే బండి సంజయ్ పదవికి రాజీనామా చేయాలి

### బండి సంజయ్ కుమారుడు దేశం దాటి పోకుండా లుకౌట్ నోటీసులు జారీ చేయాలి

- మోదీతో బండి సంజయ్ వేదికను పంచుకోవడం తప్పుడు సంకేతాలు పంపింది
- తెలంగాణలో రాజకీయ శూన్యతను భర్తీ చేసేందుకే తమ పార్టీ పుట్టిందన్న కవిత



హైదరాబాద్: కేంద్ర మంత్రి బండి సంజయ్ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత విమర్శనాస్త్రాలు మిగతా.. 2లో

## రైతులకు గుడ్ న్యూస్.. పంటల మద్దతు ధరను పెంచుతూ కేంద్రం నిర్ణయం

### ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశం

### రైతుల సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై కీలక నిర్ణయాలు

### క్వింటాల్ వరికి రూ. 2,441గా మద్దతు ధర




ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయం దేశవ్యాప్తంగా ఉన్న రైతాంగానికి భారీ ఊరటనిచ్చింది. రాబోయే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతుల సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. మిగతా.. 2లో

# ఇది కొత్త రియాలిటీ... దీన్ని ప్రోత్సహిద్దాం

### వర్క్ ఫ్రం హోమ్ విధానాన్ని ప్రోత్సహించాలని సీఎం చంద్రబాబు పిలుపు

- పశ్చిమ ఆసియా యుద్ధ నేపథ్యంలో ప్రధాని 8 సూచనలను పాటిద్దామన్న ముఖ్యమంత్రి
- పెట్రోల్ వాడకం, విదేశీ పర్యటనలు తగ్గించుకుని దుబారాకు అడ్డుకట్ట వేయాలని సూచన
- అమరావతిలో బైసర్ ఇనిస్టిట్యూట్, కిమ్స్ ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన
- క్వాంటమ్ వ్యాలీతో అమరావతి నుంచి ప్రపంచానికి కంప్యూటర్లు అందిస్తామన్న సీఎం



అమరావతి: ఇంటి నుంచే ప్రపంచం మొత్తం పనిచేసే పరిస్థితి వస్తోందని, ఈ నూతన వాస్తవికతను అందరూ ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రభుత్వంలోనూ భవిష్యత్తులో ఈ తరహా విధానాన్ని అమలు చేసే అవకాశాలు వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. మిగతా.. 2లో




## రాసి పెట్టుకోండి.. ధూళిపాళ్ల ఓడిపోవడం ఖాయం

### అంబటి రాంబాబు

- చలో మామిళ్లపల్లి కార్యక్రమంలో ధూళిపాళ్లపై అంబటి ఫైర్
- రైతుల ఇళ్లు, గోడౌన్లపై దాడి చేయించడం ఏమిటని ప్రశ్న
- లోకేశ్, పెమ్మసాని ఏం చెబితే ఐజీ అది చేస్తున్నారని విమర్శ

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గుంటూరు జిల్లా పొన్నూరు నియోజకవర్గ



## మిషన్ మోడ్‌లో పనిచేసి సేకరణ పూర్తి చేయాలి

- క్షేత్రస్థాయిలో ధాన్యం, మక్కల కొనుగోళ్ల తీరును పరిశీలించాలి
- ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయి
- లారీలు అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు పెట్టండి
- కలెక్టర్లపైనా చర్యలకు వెనుకాడం

హైదరాబాద్: రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను మిషన్ మోడ్‌లో పనిచేసి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలని సూచించారు. సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన మిగతా.. 2లో

## ఈ ప్రభుత్వం ఎంతకాలం పనిచేస్తుందో!

### అసెంబ్లీలో ఉదయనిధి స్టాలిన్ ఆసక్తికర వ్యాఖ్యలు




- విశ్వాస పరీక్షలో నెగ్గిన విజయ్ ప్రభుత్వం
- చర్చ సందర్భంగా ప్రభుత్వం మనుగడపై ఉదయనిధి అనుమానాలు
- ప్రభుత్వానికి ఓటు వేసినందుకు ప్రజలు పశ్చాత్తాపపడుతున్నారని వ్యాఖ్య

## విదేశీ పర్యటనలు, బంగారం కొనుగోళ్లు తగ్గించుకోవాలి




- మోదీ కీలక నిర్ణయం.. కాన్వాయ్ తగ్గించుకున్న ప్రధాని
- పొదుపు చర్యల్లో భాగంగా కాన్వాయ్ తగ్గించుకున్న ప్రధాని మోదీ
- కొత్తవి కొనకుండా ఎలక్ట్రిక్ వాహనాలు పెంచాలని ఎస్పీజీకి సూచన

## ఐఆర్జీసీని టార్గెట్ చేసిన అమెరికా... రూ.145 కోట్ల బంపర్ బొనాంజా ప్రకటన




- అమెరికా, ఇరాన్ మధ్య ఆలస్యమవుతున్న శాంతి ఒప్పందం
- ఈ క్రమంలో ఐఆర్‌జీసీకి సంబంధించి అమెరికా ఆఫర్
- గల్ఫ్ దేశాలపై దాడులు చేయకుండా, అణు కార్యక్రమాలు చేపట్టకుండా దెబ్బతీయడమే లక్ష్యమని వెల్లడి



## ఆంధ్రప్రదేశ్‌కు 10, తెలంగాణకు 23 టీఎంసీలు

- వేసవిలో తాగునీటి కోసం రెండు రాష్ట్రాలకు కేటాయింపు
- కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో నిర్ణయం
- వేసవి తాగునీటి అవసరాల కోసం ఇరు రాష్ట్రాలు చేసిన విజ్ఞప్తులపై భేటీ

హైదరాబాద్: శ్రీశైలం జలాశయంలో కనీస నిల్వమట్టానికి (ఎండీడీఎల్) ఎగువన మిగిలి ఉన్న 5.27 టీఎంసీల జలాలను పూర్తిగా మిగతా.. 2లో

# దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్ ఏపీలో ఏర్పాటు చేస్తాం

### అమరావతితో పాటు విశాఖ, రాయలసీమ సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు వెల్లడి

- అమరావతిలో భారీ మెడికల్ ప్రాజెక్టు.. బొల్లినేని కాలేజీకి సీఎం చంద్రబాబు శంకుస్థాపన
- అమరావతి నిడమర్రులో బొల్లినేని మెడికల్ కాలేజీకి సీఎం చంద్రబాబు శంకుస్థాపన
- లక్ష మందికి నైపుణ్య శిక్షణ అందించి గ్లోబల్ మెడికల్ హబ్‌గా మార్చడమే లక్ష్యం
- గడువులోగా ప్రాజెక్టులు పూర్తి చేయాలని పారిశ్రామికవేత్తలకు స్పష్టమైన ఆదేశాలు




అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని ప్రపంచస్థాయి వైద్య, నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దే బృహత్ ప్రణాళికకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా, నిడమర్రులో "బొల్లినేని ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కిల్, ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్" (బొల్లినేని మెడికల్ కాలేజీ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ) నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీ గంటి హరీష్, రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్, మిగతా.. 2లో




## దేశంలోనే తెలంగాణలో అత్యధిక ద్రవ్యోల్బణం

- తెలంగాణలో 5.81 శాతం రిటైల్ ద్రవ్యోల్బణం
- దేశవ్యాప్తంగా 13 నెలల గరిష్ఠానికి చేరిన ధరల సూచీ
- ఆహార పదార్థాలు, బంగారం, వెండి ధరలు పెరగడమే ప్రధాన కారణం
- ఆంధ్రప్రదేశ్‌లో 4.2 శాతంగా నమోదైన రిటైల్ ద్రవ్యోల్బణం
- గత ఆరు నెలలుగా వరుసగా పెరుగుతున్న ధరలు

హైదరాబాద్: ఏప్రిల్ నెలలో ఎండలతో పాటు ధరలు కూడా భగ్గుమన్నాయి.

# బళ్లారిలో ఘనంగా వారధి మీడియా కార్యాలయ ప్రారంభం







## – జర్నలిస్టుల సేవలు సమాజానికి దిశానిర్దేశమన్న నాయకులు

**ఆలూరు, మే 14 (స్ఫూర్తి పత్రిక):** కర్ణాటక రాష్ట్రం బళ్లారిలో వారధి ప్రింట్ మీడియా, గరుడ ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యాలయాలను గురువారం ఘనంగా ప్రారంభించారు. బళ్లారి రాయల్ సర్కిల్ సమీపంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. కర్ణాటక స్టేట్ జర్నలిస్ట్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షురాలు జానకి మోహన్ ముఖ్య అతిథిగా పాల్గొనగా, సినీ నిర్మాత పోలా ప్రవీణ్ కుమార్‌తో పాటు పలువురు రాజకీయ, సినీ, పాత్రికేయ రంగ ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆలూరు ఏపీయూడబ్ల్యూజే నాయకుడు గోపాల్ నాయుడు మాట్లాడుతూ, ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. సమాజ సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి ప్రజలకు నిజమైన సమాచారం అందించేందుకు విలేకరులు నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా నాలుగో స్తంభంగా పనిచేస్తూ ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో ముఖ్య పాత్ర పోషిస్తోందని వక్తలు అభిప్రాయపడ్డారు. సమాజ అభివృద్ధి కోసం పాత్రికేయులు ప్రాణాలకు తెగించి వార్తలు సేకరిస్తున్నారని, వారి సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. బళ్లారి జిల్లా ఐజేయూ అధ్యక్షుడు ఎర్రగుడి రమేష్ ఆహ్వానం మేరకు ఆలూరు ఏపీయూడబ్ల్యూజే నాయకులు కార్యక్రమానికి హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుత్తి నాగరాజు, దానిల్, రంగస్వామి, వాల్మీకి వీరేష్, రామ్‌మోహన్, ఛత్రపతి, హనుమేష్, చిన్న సోమన్న తదితరులు పాల్గొన్నారు.

# ఆలూరులో సీపీఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ డిమాండ్




- సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో 10 శాతం నిధులు ఇవ్వాలన్న సూచన
- కరువు కారణంగా రైతులు వలసలుద వెళ్తున్నారన్న ఆవేదన
- వేదవతి పూర్తి అయితే లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్న అభిప్రాయం

**ఆలూరు, మే 14 (స్ఫూర్తి పత్రిక):** వేదవతి సాగునీటి ప్రాజెక్టుకు తక్షణమే నిధులు కేటాయించి పెండింగ్ పనులను ప్రారంభించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆలూరులోని ఉమా కళ్యాణ మండపంలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం పది శాతం నిధులను సాగునీటి ప్రాజెక్టులకు కేటాయిస్తే వేదవతి వంటి కీలక ప్రాజెక్టులు మూడు సంవత్సరాల్లో పూర్తయ్యే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. సాగునీటి వసతులు లేక కర్నూలు పశ్చిమ ప్రాంతాలు తీవ్ర కరువు, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి నీటి కొరత పెరగడంతో రైతులు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే పరిస్థితి నెలకొనడం బాధాకరమని అన్నారు. రైతాంగాన్ని ఆదుకోవాలంటే ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వేదవతి ప్రాజెక్టు పూర్తి అయితే లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు తాగునీటి సమస్య కూడా గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం నిలదొక్కుకోవాలంటే నీటి వనరుల అభివృద్ధి అత్యవసరమని పేర్కొన్నారు. రైతాంగానికి స్థిరమైన భరోసా కల్పించాలంటే సాగునీటి ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేయాలని, రాజకీయాలకు అతీతంగా ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య, సీపీఎం నాయకులు రామకృష్ణ, వెంకటేశ్వర్లు, టీడీపీ రైతు సంఘం నాయకుడు నారాయణరెడ్డి, జనసేన నాయకుడు బోయ రంజిత్ కుమార్, బీసీవై పార్టీ నాయకుడు ఎల్లార్తి అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

# గుమ్మనూరు నారాయణ జన్మదిన వేడుకలకు భారీ ఏర్పాట్లు

## – గుంతకల్లులో నేడు ఘనంగా జన్మదిన వేడుకలు

**ఆలూరు, మే 14 (స్ఫూర్తి పత్రిక):** ఆలూరు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ జన్మదిన వేడుకలను నేడు గుంతకల్లు పట్టణంలో ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలో ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. గుంతకల్లు పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న గుమ్మనూరు నారాయణ కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు జన్మదిన వేడుకలు ప్రారంభంకానున్నాయి. ఈ కార్యక్రమానికి ఆలూరు, గుంతకల్లు నియోజకవర్గాలకు చెందిన కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, పార్టీ కార్యకర్తలు, మీడియా ప్రతినిధులు, గుమ్మనూరు కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నట్లు సమాచారం. జన్మదిన వేడుకలను పురస్కరించుకుని కార్యాలయం పరిసరాలను ప్రత్యేకంగా అలంకరించారు. అభిమానులు భారీ కేక్ కటింగ్, పూలమాలలతో సన్మానం, శుభాకాంక్షల కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. పలువురు నాయకులు గుమ్మనూరు నారాయణ ప్రజాసేవ, సామాజిక కార్యక్రమాలపై మాట్లాడనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలూరు ప్రాంత రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న గుమ్మనూరు నారాయణ ప్రజలతో సన్నిహితంగా మెలుగుతూ అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారని అభిమానులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా రైతులు, వ్యాపారులు, యువత సమస్యలపై స్పందిస్తూ ప్రజల్లో మంచి పేరు సంపాదించుకున్నారని అన్నారు. జన్మదినాన్ని పురస్కరించుకుని పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు, అభిమానుల సమావేశాలు, శుభాకాంక్షల కార్యక్రమాలు కూడా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. సోషల్ మీడియా వేదికలపై కూడా ఇప్పటికే గుమ్మనూరు నారాయణకు శుభాకాంక్షల వెల్లువ కొనసాగుతోంది. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.





# అడ్వొకేట్ దుస్తుల్లో కోర్టుకు వచ్చిన మమతా బెనర్జీ.. ఆమె న్యాయవాద హోదాపై ఆరా తీసిన బీసీఐ

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ న్యాయవాద హోదాపై భారత బార్ కౌన్సిల్ (బీసీఐ) ఆరా తీస్తోంది. గురువారం ఆమె కలకత్తా హైకోర్టులో న్యాయవాది దుస్తులు ధరించి ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)లో వాదనలు వినిపించడమే ఇందుకు కారణమైంది. ఈ పరిణామంపై స్పందించిన బీసీఐ, ఆమె న్యాయవాద వృత్తికి సంబంధించిన పూర్తి వివరాలను రెండు రోజుల్లోగా అందించాలని పశ్చిమ బెంగాల్ బార్ కౌన్సిల్‌ను ఆదేశించింది. మమతా బెనర్జీ ఎన్‌రోల్‌మెంట్ నంబర్, నమోదు చేసుకున్న తేదీ, ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు (2011-2026) ప్రాక్టీస్‌ను నిలిపివేశారా లేదా, తిరిగి ఎప్పుడు పునరుద్ధరించుకున్నారు వంటి వివరాలను సమర్పించాలని బీసీఐ తన లేఖలో కోరింది. రాజ్యాంగబద్ధమైన పదవిలో కొనసాగినందున, ఆమె న్యాయవాద వృత్తి హోదాపై వాస్తవాలను ధ్రువీకరించుకోవాల్సిన అవసరం ఉందని బీసీఐ స్పష్టం చేసింది. ఈ కేసుకు సంబంధించిన అన్ని ఒరిజినల్ రికార్డులను భద్రపరచాలని, ఎలాంటి మార్పులు చేయరాదని కూడా ఆదేశాలు జారీ చేసింది. ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో జరిగిన హింసపై దాఖలైన పిల్‌పై విచారణ సందర్భంగా మమత, ప్రధాన న్యాయమూర్తి సుజోయ్ పాల్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు వాదనలు వినిపించారు. తన ట్రేడ్‌మార్క్ తెలుపు చీరపై నల్లకోటు ధరించి కోర్టుకు హాజరైన ఆమె, రాష్ట్రంలో మహిళలు, మైనారిటీలపై దాడులు ఆందోళనకర స్థాయికి చేరాయని ఆరోపించారు. తాను 1995లోనే న్యాయవాదిగా నమోదు చేసుకున్నానని, క్రమం తప్పకుండా సభ్యత్వాన్ని పునరుద్ధరించుకుంటున్నానని ఆమె ధర్మాసనానికి వివరించారు. ఈ పరిణామంపై ప్రస్తుత ముఖ్యమంత్రి సువేందు అధికారి స్పందిస్తూ.. "నాకు చాలా పనులున్నాయి. అనవసరమైన విషయాల గురించి ఆలోచించడానికి సమయం లేదు" అని వ్యాఖ్యానించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో, భవానీపూర్ నియోజకవర్గంలో సువేందు అధికారి చేతిలో మమతా బెనర్జీ ఓటమి పాలైన విషయం తెలిసిందే.

# మీటర్ రీడర్ల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా

## – ఆలూరులో సీపీఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ హామీ



**ఆలూరు, మే 14 (స్ఫూర్తి పత్రిక):** విద్యుత్ శాఖలో పనిచేస్తున్న మీటర్ రీడర్ల సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తానని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ హామీ ఇచ్చారు. గురువారం ఆలూరులోని ఉమా కళ్యాణమండపంలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ నాయకులు కె. రామకృష్ణను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉద్యోగ భద్రత లేకపోవడం, తక్కువ వేతనాలు, విధి నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులు, పని ఒత్తిడి తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వినతిపత్రంపై స్పందించిన కె. రామకృష్ణ మాట్లాడుతూ, మీటర్ రీడర్లు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ శాఖలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బందికి తగిన రక్షణ, న్యాయం అందేలా ప్రభుత్వంతో చర్చిస్తామని తెలిపారు. మీటర్ రీడర్ల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రితో త్వరలోనే సమావేశమై చర్చిస్తానని హామీ ఇచ్చారు. కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం. వేదవ్యాసముని, ఆలూరు సబ్‌డివిజన్ కోశాధికారి కే.ఎన్. అబ్దుల్ గని, మల్లికార్జున స్వామి, సేకన్న, దివాకర్ తదితరుల ఆధ్వర్యంలో మీటర్ రీడర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆలూరు గ్రంథాలయాన్ని పరిశీలించిన రామకృష్ణ



**ఆలూరు, మే 14 (స్ఫూర్తి పత్రిక):** సీపీఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ గురువారం ఆలూరు గ్రంథాలయాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి భాస్కర్‌ను కలిసి విద్యార్థుల హాజరు, ఉద్యోగ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత గ్రంథాలయాన్ని వినియోగిస్తున్న తీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయా, ఎలాంటి సమస్యలు ఎదురవుతున్నాయా అని ఆరా తీశారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు గ్రంథాలయాలు మరింత ఉపయోగపడేలా చర్యలు అవసరమని సూచించారు. విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో గ్రంథాలయాల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య, ఆస్పరి మండల కార్యదర్శి విరుపాక్షి, సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ ఆర్‌డీసీ సెట్‌లో రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంక్ సాధించిన ఆలూరు విద్యార్థి

## – జూనియర్ కళాశాల విద్యార్థి టి. సోమయ్య ప్రతిభకు ప్రశంసలు



**ఆలూరు, మే 14 (స్ఫూర్తి పత్రిక):** ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలల ప్రవేశ పరీక్ష -- 2026--27లో ఆలూరు జూనియర్ కళాశాల విద్యార్థి టి. సోమయ్య రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంక్ సాధించి ప్రతిభ చాటాడు. గత నెల 24వ తేదీన నిర్వహించిన ప్రవేశ పరీక్షలో వాణిజ్య కంప్యూటర్ అనువర్తనాల విభాగంలో ఈ ర్యాంక్ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి. రామాదేవి తెలిపారు. సీఈసీ విభాగానికి చెందిన సోమయ్య సాధించిన విజయం కళాశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. పట్టుదల, కృషి, అధ్యాపకుల మార్గదర్శకత్వంతో విద్యార్థి ఈ స్థాయి విజయాన్ని అందుకున్నాడని ఆమె అభినందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరచగలరని ఈ ఫలితం మరోసారి నిరూపించిందన్నారు. విద్యార్థి టి. సోమయ్య భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని అధ్యాపకులు, కళాశాల సిబ్బంది ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సహ విద్యార్థులు, తల్లిదండ్రులు కూడా సోమయ్యను అభినందించారు.

# తడబడని తొలి అడుగులు

తమిళనాడు రాజకీయాల్లో ఎలాంటి అంచనాలకూ దొరకని రీతిలో ప్రారంభమై రెండేళ్ల పాటు దాన్నే కొనసాగించి చివరకు అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరూ ఊహించని రీతిలో అత్యధిక స్థానాలున్న పార్టీగా ఆవిర్భవించిన టీవీకే ఏలుబడి మొదలైంది. ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన విశ్వాస తీర్మానానికి అనుకూలంగా 144 మంది ఓటేయగా, వ్యతిరేకంగా 22 మంది, అయిదుగురు తటస్థంగా ఉండి పోయారు. డీఎంకే, డీఎండీకే, పీఎంకే, బీజేపీలు వాకౌట్ చేశాయి. సభ్యుల ప్రమాణ స్వీకారం మొదలుకొని సమావేశం పొడవునా విజయ్ వ్యవహరించిన తీరు, విశ్వాస తీర్మానంపై చర్చకు జవాబిస్తూ చేసిన ప్రసంగం విమర్శలకు తావీయకుండా ముగియటం గమనించదగ్గది. తమ ప్రభుత్వం సెక్యులర్ విధానాలకు కట్టుబడి ఉంటుందని ఆయన చెప్పటం మద్దతుగా నిలిచిన వామపక్షాలకూ, వీసీకేకూ ఊరటనిచ్చివుంటుంది. విజయ్ అణుకువతో, ఆవేశానికి తావీయని రీతిలో ఉంటూనే చేయదల్చుకున్నది చేస్తారని ఈ సమావేశం రుజువుచేసింది. వ్యక్తిగత జ్యోతిష్కుడు రికీ రాధన్ పండిట్ వెట్రివేల్‌ను ఓఎస్‌డీగా నియమించటాన్ని మిత్రపక్షం వీసీకే విశ్వాస తీర్మానం సమయంలో నిలదీసి నప్పుడు విజయ్ భేషజానికి పోకుండా వెంటనే ఆ నియామకాన్ని పునస్సమీక్షిస్తానని ప్రకటించారు. ఆ వెంటనే దాన్ని రద్దుచేసినట్టు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. ప్రార్థనాస్థలాలు, విద్యాసంస్థలు, బస్టాండ్లు వగైరాలకు 50 మీటర్ల దూరంలో మద్యం దుకాణాలు ఉండొచ్చన్న నిబంధనను 500 మీటర్లకు సవరించటం, అది వెంటనే అమల్లో కొచ్చి పదులకొద్దీ దుకాణాలు మూతబడటం కూడా జనం మెచ్చే చర్య. రాక ఇప్పటికే ప్రధాన కూటములు, పార్టీల్లో ఊహించని ప్రకంపనలకు దారి తీసింది. దాదాపు ఆరు దశాబ్దాల చరిత్రగల ద్రవిడ పార్టీలు డీఎంకే, అన్నాడీఎంకేలు జనం ఆదరణ కరవై దిక్కుతోచని స్థితిలో పడ్డాయి. ఎన్నో సంక్షోభాల్ని తట్టుకుని నిలబడ్డ డీఎంకే--కాంగ్రెస్ కూటమి చెల్లాచెదురైంది. అందలం కోసం ఆత్రపడి కాంగ్రెస్ డీఎంకే చెలిమిని వదులుకు పోయిందిగానీ సీపీఐ, సీపీఎం, వీసీకే వంటి పార్టీలు అదే కూటమిలో కొనసాగుతూనే విజయ్‌కి మద్దతివ్వక తప్పని స్థితికి చేరుకున్నాయి. అన్నాడీఎంకే చీలి ఆ పార్టీకి చెందిన 47 మంది ఎమ్మెల్యేల్లో 25 మంది మాజీ మంత్రి షణ్ముగం ఆధ్వర్యంలో పార్టీ నాయకుడు, మాజీ సీఎం పళనిస్వామికి షాకిచ్చారు. దాంతో టీవీకేకు చిన్న పార్టీల అవసరం నిజానికి ఇప్పటికే తీరిపోయింది. ఎవరిది అసలైన అన్నాడీఎంకే అనే అంశం తేలేసరికి చాలా సమయం పడుతుంది. ఈ క్రమంలో ఎక్కడా టీవీకే లేదా వ్యక్తిగతంగా విజయ్ ఆరోపణలు ఎదుర్కొనలేదు. ఎవరూ ఎవరితోనూ మాట్లాడకుండానే, గట్టి హామీలు ఇవ్వకుండానే అన్నాడీఎంకే చీలిపోయిందంటే ఎవరూ నమ్మరు. కానీ అదెక్కడా ప్రచారంలోకి రాకపోవటం విజయ్ వ్యూహచతురతకు నిదర్శనం. ద్రవిడ పార్టీలను ఎలాగైనా బలహీనపరచాలని మాజీ ప్రధాని ఇందిరాగాంధీ మొదలుకొని ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ వరకూ చేయని ప్రయత్నమంటూ లేదు. కాంగ్రెస్, బీజేపీలతో అవసరార్థం పొత్తు కుదుర్చుకుంటూనే వాటిని జనానికి చేరువ కానీయకుండా చేయటంలో అన్నాడీఎంకే, డీఎంకేలు ఇన్నాళ్లూ విజయం సాధించాయి. కానీ పార్టీకి ద్రవిడ నామం లేకుండా వచ్చిన విజయ్ సునాయాసంగా ఆ రెండు పక్షాలనూ మట్టికరిపించారు. అలాగని పెరియార్ రామస్వామి వంటివారిని ఉపేక్షించ కుండా నివాళులర్పించారు. ఆయన ఒకరకంగా రాష్ట్ర రాజకీయాల్లో మూడోపక్షానికి అవకాశం ఉన్నదని నిరూపించారు. విజయ్ సినిమా ఇతివృత్తాలు కథానాయకుడు తనకెదురయ్యే అవరోధాలను ఎదుర్కొనటం అనే అంశం చుట్టూ తిరుగుతాయి. చివరగా హీరో విజయం సాధించటంతో అవి ముగుస్తాయి. గత వారం రోజుల పరిణామాలు సైతం అదే ఒరవడిలో వెళ్లాయి. నాటకీయత లేకుండా సాధ్యమైనంత తక్కువ మాట్లాడటం, చేయదల్చుకున్నది తక్షణం చేయటం ఆయనలో కనబడే ప్రత్యేక లక్షణం. దీన్నే కొనసాగిస్తే, ప్రజల అభీష్టాన్ని నెరవేర్చే నిర్ణయాలు తీసుకుంటే ఎన్నికల్లో కొట్టొచ్చినట్టు కనబడిన జనాకర్షణ కాస్తా త్వరలోనే దృఢమైన పునాదిగా మారి, రాష్ట్ర రాజకీయాల్లో విజయ్ తిరుగులేని శక్తిగా ఎదిగేందుకు దోహదపడుతుంది.

# ఐఐటీ ముంబై, కళాశాలల విద్య ఒప్పందం పొడిగింపు




రాష్ట్ర కళాశాలల విద్య, ఐఐటీ ముంబై స్పోకెన్ ట్యుటోరియల్ ప్రాజెక్టు మధ్య ఉన్న అవగాహన ఒప్పందాన్ని మరో ఏడాది పొడిగించారు. గత మూడేండ్ల నుంచి కొనసాగిన ఒప్పందం ఈ ఏడాదితో ముగిసింది. ఈ నేపథ్యంలో శనివారం రాష్ట్ర సచివాలయంలోని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, కమిషనర్ ఆకాంక్ష సాయిని, ఐఐటీ ముంబై ట్యుటోరియల్ ప్రాజెక్టు నేషనల్ కోఆర్డినేటర్ ఆధ్వర్యంలో ఈ ఒప్పందం కుదిరింది.గత మూడేండ్ల నుంచి కొనసాగిన ఒప్పందం ప్రకారం డిగ్రీ కాలేజీలలో విద్యార్థులకు ఐటీ నైపుణ్యాలు, కంప్యూటర్ సంబంధిత సాంకేతిక అం శాలలో యానిమేషన్‌లో శిక్షణ ఇప్పించారు. 50 ప్రభుత్వ కళాశాలలో 50 వేల మందికిపైగా విద్యార్థులను శిక్షణ పూర్తిచేసుకోగా, వీరికి సర్టిఫికెట్లు కూడా ప్రదానం చేశారని విద్యాశాఖ అధికారులు తెలిపారు. కార్యక్రమం లో ఐఐటీ ముంబై స్పోకెన్ ట్యుటోరియల్ ప్రాజెక్టు నేషనల్ కోఆర్డినేటర్ జీ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# ఈపీఎఫ్ఓ సబ్ స్క్రైబర్లకు భారీ రిలీఫ్.. ఇక క్లయిమ్ ఫైలింగ్ ఈజీ..!




ఈపీఎఫ్ఓలో సబ్‌స్క్రైబర్లకు భారీ రిలీఫ్ లభించనున్నది. ఈపీఎఫ్ఓ సబ్‌స్క్రైబర్లు అనారోగ్యం, పిల్లల ఉన్నత విద్య అవసరాలు, ఇతర ఎమర్జెన్సీ అవసరాల కోసం తమ ఈపీఎఫ్ ఖాతాల నుంచి నగదు విత్ డ్రా కోసం క్లయిమ్‌లు దాఖలు చేస్తుంటారు. అలా క్లయిమ్ దరఖాస్తు చేస్తున్నప్పుడు చెక్ లీఫ్, అటెస్టెడ్ బ్యాంక్ పాస్ బుక్ ఫోటోలు అప్ లోడ్ చేయాల్సి వచ్చేది. ఇక నుంచి అలా బ్యాంక్ చెక్ లీఫ్, అటెస్టెడ్ బ్యాంక్ పాస్ బుక్ ఫోటోలు అప్ లోడ్ నిబంధనను సడలించినట్లు ఈపీఎఫ్ఓ తెలిపింది.అలా ఆన్‌లైన్‌లో తమ ఖాతాదారులు దాఖలు చేసే క్లయిమ్స్ పరిష్కారం వేగవంతం చేయడానికి ఈ సడలింపు ఉపకరిస్తుంది. తన సబ్ స్క్రైబర్ల సొంత ఖాతా గల బ్యాంక్, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ (ఎన్పీసీఐ) ద్వారా వారి కేవైసీ వివరాలను ఈపీఎఫ్ఓ నేరుగా చెక్ చేస్తుంది. డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్ (డీఎస్‌సీ) వినియోగం ద్వారా ఈపీఎఫ్ఓ సబ్ స్క్రైబర్ల బ్యాంకు ఖాతాలను వారు పని చేస్తున్న సంస్థలు ధృవీకరిస్తాయి. అలాగే సబ్ స్క్రైబర్లు సమర్పించే ఈధార్ నంబర్‌ను భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (ఉడాయ్) ధృవీకరిస్తుంది.

# ఇప్పటివరకు చూడని బర్డ్ ఫ్లూతో వ్యక్తి మృతి

## డబ్ల్యూహెచ్ఓ




అనే బర్డ్ ఫ్లూ వల్ల మెక్సికోలో ఒక వ్యక్తి మరణించాడని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్ఓ) తెలిపింది. ఇప్పటి వరకు మానవునిలో ఈ లక్షణాలు చూడలేదని పేర్కొంది.మెక్సికోలోని పౌల్ట్రీలో ఉన్నట్లు గుర్తించామని, అయితే అది మనిషికి ఎలా సోకిందో స్పష్టంగా తెలియదని పేర్కొంది. బర్డ్ ఫ్లూలో అనేక రకాలు ఉన్నాయి. యుఎస్ లోని పాడి ఆవు మందలకు సోకిన ముగ్గురు వ్యవసాయ కార్మికులకు సోకడంతో వారిలో స్వల్ప లక్షణాలు గుర్తించాము. అనేది అలాంటిది కాదని పేర్కొంది. మెక్సికో నగరంలో ఆసుపత్రిలో చేరిన 59 ఏళ్ల వ్యక్తి జ్వరం, శ్వాస ఆడకపోవడం, విరేచనాలు, వికారం వంటి వాటితో బాధపడుతూ ఏప్రిల్ 24న మరణించాడని డబ్ల్యూహెచ్ఓ తెలిపింది. మెక్సికో ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఈ మరణంపై స్పందిస్తూ వ్యక్తి నుండి వ్యక్తికి బర్డ్ ఫ్లూ వ్యాపించినట్లు ఎటువంటి ఆధారాలు లేవని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. మెక్సికోలోని మరణించిన వ్యక్తితో పరిచయం ఉన్న వ్యక్తులను పరీక్షించినప్పటికీ ఇప్పటివరకు మానవ కేసులు కనుగొనబడలేదని డబ్ల్యూహెచ్ఓ తెలిపింది.

# అంతరిక్షంలో వెయ్యి రోజులు.. రష్యా వ్యోమగామి ఒలెగ్ రికార్డు



అంతరిక్షంలో వెయ్యి రోజుల పాటు గడిపి ఓ రష్యా వ్యోమగామి రికార్డు సృష్టించారు. ఒలెగ్ కొనొనెన్కో(59) 2008 నుంచి ఐదుసార్లు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి ప్రయాణించారు. మంగళవారం నాటికి ఆయన వెయ్యి రోజుల పాటు అంతరిక్షంలోనే నివసించారు. దీంతో ప్రపంచంలోనే ఎక్కువ రోజులు అంతరిక్షంలో ఉన్న వ్యోమగామిగా ఒలెగ్ రికార్డు సృష్టించారని రష్యా అంతరిక్ష సంస్థ రోస్కాస్మోస్ బుధవారం ప్రకటించింది.2024 సెప్టెంబర్ 23 వరకు ఆయన అంతరిక్షంలోనే ఉండనున్నారు. అప్పటికి 1,110 రోజులు అంతరిక్షంలో ఉన్నట్టు అవుతుంది. కాగా, ఒలెగ్ తర్వాత 878 రోజుల 11 గంటల 29 నిమిషాల 48 సెకన్ల పాటు అంతరిక్షంలో ఉన్న రికార్డును రష్యాకే చెందిన గెన్నడీ పడల్క 2015లో సృష్టించారు.

# కొరియన్ ద్వీపకల్పంపై బి-1బి బాంబర్ చక్కర్లు

## ఏడేళ్ల తర్వాత రంగంలోకి దించిన అమెరికా



సియోల్: ఆయుధ పరీక్షలతో దూకుడు ప్రదర్శిస్తున్న ఉత్తర కొరియాకు హెచ్చరికగా అమెరికా తన బి-1బి బాంబర్‌ను రంగంలోకి దించింది.బుధవారం కొరియన్ ద్వీపకల్పంపై ఇది గగనవిహారం చేసింది. దక్షిణ కొరియాతో కలిసి బాంబింగ్ విన్యాసాలను నిర్వహించింది. ఏడేళ్లలో ఈ బాంబర్ ఈ ప్రాంతంలో గగనవిహారం చేయడం ఇదే మొదటిసారి. ఈ విన్యాసాల్లో అమెరికా, దక్షిణ కొరియాలకు చెందిన అనేక యుద్ధ విమానాలు పాల్గొన్నాయి.వీటిలో బి-1బి బాంబర్.. జాయింట్ డైరెక్ట్ అటాక్ మ్యునిషన్ (జ్యేడామ్) అనే బాంబులను జారవిడిచింది. చివరిసారిగా ఈ బాంబరు 2017లో కొరియా ద్వీపకల్పంపై గగనవిహారం చేసింది. జేడ్యామ్ అనేది ఒక మార్గనిర్దేశక వ్యవస్థ. ఇది సంప్రదాయ అన్‌గైడెడ్ బాంబులను మరింత కచ్చితత్వంతో లక్ష్యాన్ని ఛేదించగల జీపీఎస్ గైడెడ్ ఆయుధాలుగా మారుస్తుంది. అమెరికాకు చెందిన యుద్ధ విమానాలు, బాంబర్లు, డ్రోన్లు ఈ జేడ్యామ్‌లను ప్రయోగించగలవు. రష్యా దాడులను ఎదుర్కోవడానికి వీటిని ఉక్రెయిన్‌కు సరఫరా చేస్తోంది.

# ఎట్టకేలకు నింగిలోకి బోయింగ్ వ్యోమనౌక




మూడోసారి రోదసిలోకి పయనమైన సునీతా విలియ మ్స్‌సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్‌కేప్ కెనావెరాల్: ఏళ్ల తరబడి జాప్యం తర్వాత బోయింగ్‌కు చెందిన స్టార్‌లైనర్ వ్యోమనౌక బుధవారం నింగిలోకి పయనమైం ది.ఇందులో భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్‌మోర్‌లు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)కు బయల్దేరారు. వీరు గురువారం ఈ కేంద్రాన్ని చేరుకుంటారు. అక్కడే వారం బస చేస్తారు. తిరిగి స్టార్‌లైనర్‌లో భూమికి తిరిగొస్తారు.ఈ వ్యోమనౌకకు ఇది తొలి మానవసహిత అంతరిక్ష యాత్ర. దీన్ని గత నెల మొదటి వారంలో రోదసిలోకి ప్రయోగించేందుకు తొలిసారిగా సన్నాహాలు జరిగాయి. అయితే రాకెట్‌లో సమస్యలు రావడంతో చివరి నిమిషంలో ప్రయోగాన్ని నిలిపివేయాల్సి వచ్చింది. గతవారం మరోసారి స్టార్‌లైనర్ ప్రయోగానికి ప్రయత్నించగా..సాంకేతిక ఇబ్బందులతో ఆపేయాల్సి వచ్చింది. మూడో ప్రయత్నంలో బుధవారం ఈ వ్యోమనౌక నింగిలోకి బయల్దేరింది. ఈ యాత్ర విజయవంతమైతే.. ఐఎస్ఎస్‌కు వ్యోమగాములను పంపడానికి మరో వ్యోమనౌక అమెరికాకు అందుబాటులోకి వస్తుంది. ప్రస్తుతం స్పేస్ఎక్స్ సంస్థ సేవలే ఆధారమవుతున్నాయి. సునీతా విలియమ్స్‌కు ఇది మూడో అంతరిక్ష యాత్ర.

# ఇంటి రుణం చెల్లింపు పూర్తయితే తీసుకోవాల్సిన జాగ్రత్తలివే..!




ప్రతి ఒక్కరూ సొంతింటి కల సాకారం చేసుకోవాలని భావిస్తారు. గతంతో పోలిస్తే సొంతింటి కల నిజం చేయడానికి బ్యాంకులు సహకరిస్తున్నాయి. సంబంధిత వ్యక్తి, కుటుంబ సభ్యుల ఆదాయం, సిబిల్ స్కోర్ ఆధారంగా ఇండ్ల రుణాలు మంజూరు చేస్తున్నాయి. అలా మంజూరైన ఇండ్ల రుణాలు త్వరితగతిన చెల్లించడానికి ప్రాధాన్యం ఇస్తుంటారు. 10 నుంచి 20 ఏండ్ల పాటు ఇంటి రుణం చెల్లింపు పూర్తయిన తర్వాత ప్రతి ఒక్కరూ ఆనందడోలికల్లో మునిగి తేలుతారు. ఈ ఆనందంలో కొన్ని తప్పులు, పొరపాట్లు చేస్తుంటారు. రుణం ఇచ్చిన బ్యాంకుల నుంచి కీలక డాక్యుమెంట్లు తీసుకోవడం మరిచిపోతుంటారు. దీనివల్ల భవిష్యత్‌లో సమస్యలు ఎదురు కావచ్చు. కనుక రుణ గ్రహీతలు తమ రుణం పూర్తిగా చెల్లించినట్లైతే.. సదరు బ్యాంకు నుంచి తీసుకోవాల్సిన ముఖ్యమైన పత్రాల గురించి తెలుసుకుందామా..!ఇంటి రుణం మంజూరు చేస్తున్నప్పుడు సంబంధిత ఆస్తి పత్రాలను బ్యాంకు తీసుకుంటుంది. అంటే సంబంధిత రుణ గ్రహీత ఇల్లు తాకట్టులో ఉన్నదని అర్థం. అలా తీసుకున్న రుణం పూర్తిగా చెల్లించే వరకూ సదరు ఆస్తి పత్రాలు బ్యాంకు వద్దే ఉంటాయి. కనుక లోన్ పూర్తిగా చెల్లించగానే, బ్యాంకు సదరు రుణ గ్రహీతకు అసలు పత్రాలు ఇచ్చేస్తుంది. కనుక లోన్ చెల్లింపులు పూర్తయిన తర్వాత ఇంటి అసలు పత్రాలు తీసుకోవడం మరిచిపోవద్దని ఆర్థిక వేత్తలు చెబుతున్నారు.ఇంటి రుణం పూర్తిగా చెల్లించిన తర్వాత అసలు ఇంటి పత్రాలతోపాటు సంబంధిత బ్యాంకు నుంచి 'నో డ్యూ సర్టిఫికెట్' తీసుకోవాల్సి ఉంటుంది. అలా 'నో డ్యూ సర్టిఫికెట్' ఇవ్వడం వల్ల సదరు వ్యక్తికి ఆ ఇంటిపై యాజమాన్య హక్కులు కల్పించినట్లవుతుంది.ఇంటి కొనుగోలుకు రుణం ఇచ్చిన బ్యాంకుకు సదరు ఆస్తిపై హక్కు ఉంటది. కనుక అత్యవసర పరిస్థితులు ఏర్పడినా రుణం పూర్తిగా చెల్లించే వరకూ బ్యాంకు అనుమతి లేకుండా ఆ ఇంటిని అమ్మలేరు. రుణం పూర్తిగా చెల్లించిన తర్వాత బ్యాంకు నుంచి 'నో అబ్జక్షన్ సర్టిఫికెట్' పొందితే ఇంటిపై బ్యాంకు తాత్కాలిక హక్కు కల్పిస్తుంది. ఆ తర్వాతే మీరు అవసరమైతే మీ ఇంటిని అమ్ముకోవచ్చు.ఇక ఇంటి రుణం తీసుకోవడంలో సిబిల్ స్కోర్ కీలకం. రుణం పూర్తిగా చెల్లించిన తర్వాత మీ క్రెడిట్ స్కోర్ అప్ డేట్ అయ్యిందా? లేదా? అన్న సంగతి చెక్ చేసుకోవాల్సి ఉంటుంది. లేకపోతే ముందు మీరు రుణం పొందడం కష్ట సాధ్యమవుతుందని ఆర్థికవేత్తలు చెబుతున్నారు.

# గూగుల్ పేతో క్యాష్ బ్యాక్ ఆఫర్లు.. ఇవీ డిటైల్స్..!




ఇప్పుడు ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్ ఉండాల్సిందే. రోజురోజుకు పెరిగిపోతున్న టెక్నాలజీతోపాటు పలు రకాల సర్వీసులు, పనుల కోసం స్మార్ట్ ఫోన్ ఉపకరిస్తున్నది. ఫోన్ కాల్స్, మెసేజ్‌లు పంపుకోవడానికి మాత్రమే పరిమితం కాకుండా యూపీఐ ఆధారిత మొబైల్ యాప్స్ సాయంతో ఆర్థిక లావాదేవీలు నిర్వహించుకోవచ్చు. స్మార్ట్ ఫోన్లలో గూగుల్ పే యాప్ కూడా ఉంది. దీంతో యూపీఐ లావాదేవీలు, గ్రాసరీ నుంచి అన్ని రకాల వస్తువుల కొనుగోళ్ల షాపింగ్, యుటిలిటీ బిల్లులు, గ్యాస్ సిలిండర్, నీటి బిల్లుల చెల్లింపులు, ఫోన్ రీచార్జీ తేలిగ్గా చేసేయొచ్చు. గూగుల్ పే సాయంతో యుటిలిటీ బిల్లుల చెల్లింపుతో క్యాష్ బ్యాక్ ఆఫర్లు కూడా లభిస్తాయి. గూగుల్ పేతో మనీ కూడా సంపాదించొచ్చు. ఇందుకోసం గూగుల్ ఎర్న్ మనీ ట్రిక్ ఉపకరిస్తుంది. ఈ ట్రిక్ ఎలా ఉపకరిస్తుందన్న సంగతి తెలుసుకుందామాస్మార్ట్ ఫోన్ల యూజర్లు 'గూగుల్ పే' రిఫరల్ కోడ్ వినియోగిస్తూ డబ్బు సంపాదించుకోవచ్చు. ముందుగా గూగుల్‌పే యాప్ యూజర్లు తమ గూగుల్ పే యాప్ లింక్‌ను మిత్రులు, పరిచయస్తులకు షేర్ చేస్తే.. యాప్ అందించే ఆఫర్ ప్రకారం రూ.101 నుంచి రూ.201 వరకూ క్యాష్ బ్యాక్ వస్తుంది. ఇతరులు మీ లింక్ ద్వారా గూగుల్ పే యాప్ డౌన్ లోడ్ చేసుకుని లావాదేవీలు జరిపితేనే ఈ ఆఫర్ పని చేస్తుంది. మీరు పంపిన గూగుల్ పే యాప్‌ను మీ మిత్రులు, పరిచయస్తులు వాడకపోయినా ముందు మీ ఖాతాకు రూ.200 పంపించమనండి.. తరిగి మీరు ఆ వ్యక్తికి రూ.200 పంపేయొచ్చు. అలా చేసినా మీకు రూ.101 %-% 201 క్యాష్ బ్యాక్ లభిస్తుంది. ఇలా రోజూ ఐదుగురికి గూగుల్ పే యాప్ లింక్ పంపితే రూ.500 నుంచి రూ.1000 వరకూ ఆదాయం పొందొచ్చు.గూగుల్ పే యాప్‌లో ఖాతా ప్రారంభించాలంటే మీరు తప్పనిసరిగా బ్యాంకు ఖాతా కలిగి ఉండాలి. మీ స్మార్ట్ ఫోన్ మొబైల్ నంబర్ ను బ్యాంక్ ఖాతాకు అనుసంధానించాలి. ఏటీఎం లేదా డెబిట్ కార్డు కూడా ఉండాలి. ముందుగా గూగుల్ ప్లే స్టోర్ లోకి వెళ్లి గూగుల్ పే అని టైప్ చేసి ఎంటర్ క్లిక్ చేయాలి. అటుపై గూగుల్ పే యాప్ డౌన్ లోడ్ / ఇన్ స్టాల్ లింక్ మీద క్లిక్ చేయాలి. దీంతో స్మార్ట్ ఫోన్ లో గూగుల్ అప్లికేషన్ డౌన్ లోడ్ అవుతుంది. చివరిగా గూగుల్ పే మొబైల్ యాప్ తెరిచి ఆర్థిక లావాదేవీలు జరుపుకోవచ్చు.

# క్రమశిక్షణ పేరుతో నాలుగేళ్ల బాలుడి నోట్లో పచ్చి మిర్చీ కుక్కిన తండ్రిబీ ఆ చిన్నారి మృతి



రెండేళ్ల క్రితం, క్రమశిక్షణ పేరుతో తన నాలుగేళ్ల కుమారుడి నోట్లో పచ్చి మిర్చీ కుక్కి, ఆ బాలుడి మరణానికి కారణమైన సింగపూర్ వ్యక్తికి ఎనిమిది నెలల జైలు శిక్ష పడింది.ఈ ఘటన 2022 ఆగస్ట్ లో సింగపూర్ లో చోటు చేసుకుంది.బయట టాయిలెట్ కు వెళ్లాడని..చిన్న పిల్లలకు సాధారణంగా టాయిలెట్ ఉపయోగించడంపై చిన్న వయస్సు నుంచే శిక్షణ ఇస్తుంటారు. అలా తన కుమారుడికి కూడా ఆ 38 ఏళ్ల తండ్రి టాయిలెట్ ట్రైనింగ్ ఇస్తున్నాడు. 2022 ఆగస్టులో కుమారుడితో కలిసి ఆ తండ్రి సింగపూర్లోని తన ఇంట్లో ఉండగా ఈ ఘటన జరిగింది. ఆ 4 ఏళ్ల బాలుడు టాయిలెట్ ఉపయోగించకుండా, బయటే మలవిసర్జన చేశాడు. దాంతో, ఆ తండ్రికి పట్టరాని కోపం వచ్చింది. తప్పు చేసిన కొడుకును శిక్షించాలనుకున్నాడు. ఆ బాలుడు ఏడుస్తున్నా, పట్టించుకోకుండా, పచ్చి మిర్చీని బలవంతంగా ఆ బాలుడి నోట్లో కుక్కాడు. ఏడుస్తూ, ఆ బాలుడు గది అంతా పరుగులు పెట్టాడు. తన గొంతు వైపు చూపుతూ సైగలు చేస్తూ కాసేపటికి కుప్పకూలి స్పృహ కోల్పోయాడు.హుటాహుటిన ఆసుపత్రికి..తల్లి ఎంత ప్రయత్నించినా బాలుడి పరిస్థితి మెరుగుపడకపోవడంతోఅంబులెన్స్‌కోసం కాల్ చేసింది. చివరకు తండ్రి ఆ బాలుడిని ఎత్తుకుని సమీపంలోని ఫ్యామిలీ క్లినిక్ కు తీసుకెళ్లాడు. అప్పటికే చిన్నారి పల్స్, శ్వాసను కోల్పోయినట్లు సమాచారం. అనంతరం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. శవపరీక్షలో మిర్చి ముక్క బాలుడి శ్వాసనాళంలో ఇరుక్కుపోయినట్లు తేలింది. ఆ బాలుడి తల్లిదండ్రులకు మరో ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ నేరంపై ఆ బాలుడి తండ్రికి స్థానిక కోర్టు 8 నెలల జైలు శిక్ష విధించింది. "మీ పిల్లలను క్రమశిక్షణలో పెట్టడానికి మీరు ఇలాంటి పద్ధతిని అవలంబించడం సరికాదు" అని శిక్ష ప్రకటిస్తూ న్యాయమూర్తి వ్యాఖ్యానించారు.

# ఈ లక్షణాలు కనిపిస్తున్నాయా.. మీ కాలేయానికి ప్రమాదం పొంచి ఉన్నట్లే !



కాలేయం.. శరీరంలో అతి కీలకమైన అవయవం. ఇది అతిపెద్ద గ్రంథి. ఒక్క కాలేయమే దాదాపు అయిదొందల విధులు నిర్వర్తిస్తుంది. చర్మం తరువాత ఒక్క కాలేయానికే పునరుత్పత్తి సామర్థ్యంఉంది. దాదాపు డెబ్బయి అయిదు శాతం దెబ్బతిన్నా కూడా.. తక్కిన పావు భాగంతోనే కాలేయం తన విధులను నిర్వహించగలదు. అంతేకాదు, ఆరోగ్యకరమైన జీవనశైలితో శిథిలమైన భాగాన్ని తిరిగి అభివృద్ధి చేసుకోగల అసాధారణ శక్తి కాలేయానికి ఉంది. మనిషి మరణించే వరకూ ఆ పునరుత్పాదక శక్తి కొనసాగుతుంది. అంటే కాలేయం తనకు నష్టం కలిగిస్తున్న అలవాట్లు, వ్యాధులను గుర్తించి.. ఆ లోపాల్ని సరిదిద్దుకోవడానికి మనిషికి అవకాశం ఇస్తుందన్నమాట. అయితే కాలేయ కణాలు మొత్తం దెబ్బతిన్నప్పుడు మాత్రం పరిస్థితి పూర్తిగా చేజారుతుంది. కాలేయానికి ఉన్న ప్రత్యేక శక్తి కూడా పనికి రాకుండా పోతుంది.మద్యపాన వ్యసనం, హెపటైటిస్-బి, సి వైరస్ ఇన్ఫెక్షన్ల వల్ల ఎక్కువమందికి కాలేయ వ్యాధులు దాపురిస్తున్నాయి. ఆ రుగ్మతకు సంకేతంగా మొదట కామెర్ల వ్యాధి సోకుతుంది. దాన్ని గుర్తించి వెంటనే చికిత్స చేయించుకోవాలి. లేదంటే, అది కాస్త ముదిరి కాలేయం పనితీరు తీవ్రంగా దెబ్బతింటుంది.

## తొలిదశలోనేజి

వీటిలో హెపటైటిస్- ఎ, ఇ వైరస్‌ల వల్ల వచ్చే కామెర్లు మరీ ప్రమాదకరం. హఠాత్తుగా మరణం ముంచుకొస్తుంది. కలుషితమైన నీళ్లు, ఆహారం నుంచి హెపటైటిస్-ఎ, ఇ వైరస్‌లు శరీరంలో ప్రవేశిస్తాయి. దీర్ఘకాలంపాటు మితిమీరిన మద్యపానం అలవాటు.. కాలేయాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుంది. దీంతో, లివర్ సిరోసిస్ వ్యాధి వస్తుంది.ఊబకాయం కూడా కాలేయ వ్యాధులకు కారణం అవుతున్నది. ఫ్యాట్ సిరోసిస్ లేదా నాన్ ఆల్కహాలిక్ స్టియటోహెపటైటిస్ ఏర్పడుతుంది. ప్రస్తుతం కాలేయ సమస్యలతో వస్తున్న వారిలో దాదాపు సగం మందిలో ఈ ఫ్యాట్ సిరోసిస్ వ్యాధే కనిపిస్తున్నది. ఫ్యాట్ సిరోసిస్ బి, సి దశ ప్రారంభంలో కాలేయ కణాలు చాలావరకు పనిచేయలేని స్థితికి చేరుకుంటాయి. ఇక పిల్లల్లో కనిపించే కాలేయ వ్యాధులు చాలావరకు పుట్టుకతో వస్తున్నవే. శరీరధర్మాలకు సంబంధించినవే. విల్సన్ డిసీజ్, బైల్ డక్ట్స్ లేకపోవటం, కురుపులు వంటి సమస్యలు కూడా ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ సమస్యలు ఉన్న పిల్లల కాలేయం భవిష్యత్తులో పూర్తిగా పనిచేయలేని స్థితికి చేరుకుంటుంది.కాలేయం దెబ్బతినటం ఓ ప్రమాద సంకేతం. ముందుగానే గుర్తించగలిగితే క్యాన్సర్ సహా వివిధ కాలేయ వ్యాధులను ఔషధాలతో నయం చేయవచ్చు. నిర్లక్ష్యం చేస్తే మాత్రం పరిస్థితి చేజారిపోతుంది. కాలేయ వ్యాధులు సోకినా కూడా.. ఆ లక్షణాలు బయటపడటానికి పది నుంచి ఇరవై సంవత్సరాల సమయం పడుతుంది. ఈ సుదీర్ఘ కాలంలో కాలేయ కణాలు క్రమంగా మృతిచెందుతూ వస్తాయి. దీంతో 'లివర్ స్కార్' ఏర్పడుతుంటుంది. ఇది కాలేయాన్ని పూర్తిగా కప్పేసేటప్పటికి రోగలక్షణాలు స్పష్టంగా బయటపడతాయి. అప్పటికే వ్యాధి ముదిరిపోయి ఉంటుంది. ఈ పరిస్థితికి చేరేలోగా కాలేయానికి కష్టాలు మొదలైపోతాయి. ఆ సంకేతాలూ కనిపిస్తాయి. కళ్లు పచ్చబడతాయి. దురద బాధపెడుతుంది. ఆకలి మందగిస్తుంది. నీరసంగా ఉంటుంది. ఎప్పుడూ నిద్రమత్తే. కడుపులో వికారంగా అనిపిస్తుంది. ఏకాగ్రత కుదరదు. జ్ఞాపకశక్తి మందగిస్తుంది. చివరికి కోమాలోకి జారిపోతారు.కాలేయ క్యాన్సర్ అంటే ఇదివరకు డాక్టర్లలో కూడా దాదాపు 90 శాతం మందికి మరణమే అనే భావన ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. అత్యాధునిక సర్జరీతో క్యాన్సర్ కణుతులను పూర్తిగా తొలగించటం సాధ్యమవుతున్నది. కణితి 3- 5 సెంటీమీటర్లు ఉంటే ఆర్ఎఫ్ఏ, టీఏసీఈ వంటి సర్జరీయేతర చికిత్స చేస్తారు. వీరిలో 90 శాతం మంది కోలుకుంటారు. అయితే వీరికి రెండు మూడేండ్లలో మళ్లీ కాన్సర్ వచ్చే ముప్పు ఉంటుంది. అందువల్ల క్రమం తప్పకుండా డాక్టర్‌కు చూపించుకుంటూ ఉండాలి. అవసరమైతే ఆ చికిత్సలను కొనసాగించి క్యాన్సర్ కణుతులను అదుపుచేస్తారు. 'బి' నుంచి తరువాతి స్థాయికి మారుతున్న స్థితిలో వచ్చినవారికి, 'సి' చైల్డ్ స్థాయి పూర్తిగా ముదరని దశలో వచ్చిన వారికి కాలేయ మార్పిడి చేయడం ద్వారా ప్రాణాపాయం నుంచి రక్షించవచ్చు. ఇలాంటి కేసులలో తొంభై అయిదు శాతం వరకు కాలేయ మార్పిడి సర్జరీలు విజయవంతం అవుతున్నాయి. ఇటీవలి కాలంలో కాలేయ వ్యాధుల చికిత్స ఆధునికతను సంతరించుకుంది. వ్యాధి నిర్ధారణ పరీక్షలు, శక్తిమంతమైన మందులు, కచ్చితమైన శస్త్రచికిత్సలు, కాలేయ



మార్పిడి సర్జరీలు ఎక్కువ శాతం విజయవంతం అవుతుండటం కాలేయ వ్యాధిగ్రస్తులకు ఉపశమనం కలిగిస్తున్నాయి.వివిధ కారణాలతో కాలేయం పూర్తిగా పనిచేయలేని స్థితికి చేరుకున్నప్పుడు రోగి ప్రాణాలను కాపాడేందుకు కాలేయ మార్పిడి ఒక్కటే మార్గాంతరం. పాడైన కాలేయాన్ని తీసేసి.. ఆ స్థానంలో ఆరోగ్యకరమైన కాలేయాన్ని అమర్చటానికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీ చేస్తారు. దీనిలో దాత నుంచి మొత్తం కాలేయాన్ని కానీ లేదా కొంతభాగాన్ని కానీ సేకరించి అమరుస్తారు. చాలా సందర్భాల్లో అవయవదానానికి అంగీకరించిన వ్యక్తి మృతిచెందిన వెంటనే సేకరించిన కాలేయంతోనే మార్పిడి చేస్తుంటారు. కొన్ని సందర్భాల్లో రక్తం గ్రూపు కలిసిన కుటుంబసభ్యులు, బంధువులు తమ కాలేయంలో నాలుగో వంతు భాగాన్ని దానం చేస్తున్నారు. ఈ విధంగా కాలేయంలో కొంతభాగాన్ని తెంచుకున్నప్పటికీ దాతలు మిగిలిన భాగంతో ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపగలుగుతారు. కోల్పోయిన భాగం కొద్ది వారాల్లోనే పూర్వపు పరిమాణానికి పెరుగుతుంది. అదే సమయంలో స్వీకర్తలో కూడా కాలేయం పూర్తిస్థాయికి ఎదుగుతుంది.మార్పిడి రెండు రకాలుఅయితేమద్యపానం, డ్రగ్స్‌కు అవాటుపడిన, ఇన్ఫెక్షన్స్, గుండె ఊపిరితిత్తులు- నాడీ సంబంధిత వ్యాధులు ఉన్నవాళ్లు కాలేయ దానానికి అనర్హులు. ఇలాంటి ఆరోగ్య సమస్యలు లేని యాభై ఏండ్ల లోపు రక్త సంబంధీకులు ఎవరైనా కాలేయ దానం చేయవచ్చు. బంధువులు ముందుకు రాకపోయినా, వచ్చినవాళ్లు ఆరోగ్యపరంగా అర్హులు కాకపోయినా.. కాలేయ మార్పిడి అవసరమైన వారు 'జీవన్‌దాన్' పథకం కింద పేరు నమోదు చేయించుకోవాలి. అంటే కాలేయ మార్పిడికి రెండు పద్ధతులు ఉన్నాయన్న మాట. మొదటిది, జీవించి ఉన్న దాత శరీరం నుంచి సేకరించిన దాన్ని అవసరమైన వారికి అమర్చటం. రెండోది బ్రెయిన్‌డెడ్ అయినవారి నుంచి సేకరించడం. కాలేయం అందుబాటులోకి వచ్చిన వెంటనే వ్యాధిగ్రస్తుడిని ఆపరేషన్‌కు సిద్ధంచేస్తారు. బంధువు (లైవ్ డోనార్) నుంచి కాలేయం తీసుకుంటున్న పక్షంలో వేర్వేరు ఆపరేషన్ థియేటర్లలో ఒకేసారి



ఇద్దరికీ సర్జరీ చేస్తారు.అదే బ్రెయిన్‌డెడ్ వ్యక్తి నుంచి సేకరిస్తున్నట్లయితే ఆ కాలేయం రాగానే శస్త్రచికిత్స మొదలుపెడతారు. ఆపరేషన్ పూర్తికావటానికి నాలుగు నుంచి పద్నాలుగు గంటల సమయం పడుతుంది. ఒక డాక్టర్ల బృందం వ్యాధిగ్రస్తుడి శరీరం నుంచి పనిచేయని కాలేయాన్ని తీసివేస్తుంటే మరో బృందం మంచి కాలేయాన్ని మార్పిడికి సిద్ధం చేస్తుంటుంది. ఇవి పూర్తికాగానే ఆరోగ్యవంతమైన కాలేయాన్ని వ్యాధిగ్రస్తుడిలో అమర్చే సర్జరీ జరుగుతుంది. ఆరోగ్యవంతమైన దాన్ని అమర్చి రక్తనాళాలు, బైల్ డక్ట్స్‌ను కలిపిన వెంటనే కొత్త కాలేయంలోకి రక్తప్రవాహం ప్రారంభమవుతుంది.ఇలా అమర్చిన కాలేయాన్ని రిజెక్షన్ (కొత్తగా అమర్చిన అవయవాన్ని శరీరం తిరస్కరించి రోగనిరోధక వ్యవస్థ దానిపైన దాడిచేయటం) నుంచి కాపాడి, కొత్త వ్యక్తి శరీరంతో సర్దుకుపోయేందుకు డాక్టర్లు ఇంజక్షన్లు, ఇతర మందులు ఇస్తారు. రక్తస్రావం, సంక్రమణ వ్యాధుల నుంచి కాపాడతారు. అదే సమయంలో మార్చిన కాలేయాన్ని కాపాడుకుంటూ అది సరిగ్గా పనిచేసేట్లు చూసుకోవటానికి తీసుకోవలసిన జాగ్రత్తలను మార్పిడి చేయించుకున్న వ్యక్తికి, కుటుంబానికి తెలియజేస్తారు. కాలేయ మార్పిడి చేయించుకున్న వారు పూర్తిగా కొలుకున్న తరువాత కొద్దివారాలు విశ్రాంతి తీసుకుని తమ జీవితాన్ని తిరిగి ప్రారంభించగలుగుతారు.ముందస్తు పరీక్షలుమద్యపాన వ్యసనపరులు, వైరస్ వ్యాధులు సోకినవారు, ఫ్యాటీలివర్ వ్యాధిగ్రస్తులు లివర్ స్కార్ లక్షణాలు పూర్తిగా బయటపడే దాకా వేచి ఉండకుండా.. ముందస్తు పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. రక్తపరీక్ష, ఫైబ్రోస్కాన్ (ట్రాన్సియెంట్ ఎలాస్టోగ్రఫీ) ద్వారా కాలేయ క్యాన్సర్‌ను తొలిదశల్లోనే గుర్తించవచ్చు. ఇక వివిధ వ్యాధుల వల్ల కాలేయానికి జరిగిన నష్టాన్ని బట్టి ఆ తీవ్రతను మూడు దశలుగా గుర్తిస్తారు. వీటిని ఎ, బి, సి.. 'చైల్డ్ పగ్ స్టేజెస్'గా వర్గీకరించారు. 'ఎ' చైల్డ్ దశలోనే డాక్టర్‌ను సంప్రదిస్తే మందులతో, అలవాట్లలో మార్పులతో చికిత్సచేసి పూర్తి సాధారణ పరిస్థితికి తీసుకురావచ్చు. మొదటి రెండు (ఎ, బి చైల్డ్ స్టేజెస్ ) దశల్లో కాలేయం చాలా వరకు తిరిగి కోలుకోవటానికి అవకాశం ఉంటుంది. పరిస్థితి పూర్తిగా విషమించిన దశతో పోలిస్తే మొదటి దశలో చికిత్సకు అయ్యే ఖర్చు పది శాతాన్ని మించదు. దురదృష్టవశాత్తు మనదేశంలో కాలేయ వ్యాధిగ్రస్తులలో అత్యధికులు 'బి' నుంచి 'సి' చైల్డ్ స్టేజికి మారేదశలో, 'సి' చివరి దశలో ఆస్పత్రులకు వస్తున్నారు.

SPHOORTI PATRIKA (Telugu Daily) | PRGI Reg. No. APTEL/26/A0542 | Publisher, Printer & Editor: NarasaNaidu Boya | Printed at: Rajeswari Printers, Kurnool |
Place of Publication: Kurnool, Andhra Pradesh | Cell: 8179446036, 7794947413 | Email: sphoortipatrika@gmail.com | Website: www.sphoortipatrika.com